## సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**78932 44734**

నంబర్‌ను సంప్రదించండి

# ఇది మా అడ్డా!



రోడ్డు పక్కన వేసిన భవన నిర్మాణ సామగ్రిని తరలిస్తున్న వ్యాపారస్తులు

పారిశ్రామిక ప్రాంత వాసులు నిత్యం నరకం చూస్తున్నారు. ఓ వైపు కాలుష్యం బెడద.. మరో వైపు సరైన రోడ్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. **అవి చాలవన్నట్టు కొత్త** కష్టాలు వచ్చాయి. రోడ్డుకు **ఇరువైపులా భవన** నిర్మాణ సామగ్రి వేసి వ్యాపారాలు **చేయడంతో** ప్రమాదాలకు గురవుతున్నారు. **ఏకంగా రోడ్లు** ఆక్రమించి వ్యాపారాలు **చేస్తున్నా అధికా**రులు అటువైపు కన్నెత్తి **చూడకపో**వడంపై విమర్శలు **వెల్లువెత్తు**తున్నాయి.

- రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి స్టాక్ పాయింట్లు
- కూటమి నేత దన్నుతో రెచ్చిపోతున్న వ్యాపారులు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- మల్కాపురం నుంచి యారాడ వెళ్లే మార్గంలో దుస్థితి
- పట్టించుకోని అధికారులు

**సింధియా:** పారిశ్రామిక ప్రాంతంలోని మల్కాపురం పోలీస్‌స్టేషన్ నుంచి యారాడ వెళ్లే మార్గాన్ని భవన నిర్మాణ సామగ్రితో నింపేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా కొందరు వ్యాపారులు గుట్టలు గుట్టలుగా సామగ్రిని డంపింగ్ చేస్తున్నారు. అక్కడ నుంచి కొనుగోలుదారులకు నేరుగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనే భవన నిర్మాణ సామగ్రి వేయడంతో పాదచారులు రోడ్డు మధ్యలో నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

### పట్టించుకునే వారేరి?

పారిశ్రామిక ప్రాంతంలో భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో వ్యాపారులు రూపాయి అద్దె చెల్లించే పని లేకుండా రోడ్లనే స్టాక్ పాయింట్లుగా వినియోగిస్తున్నారు. మరో వైపు పాత నిర్మాణాలను తొలగించిన వ్యర్థాలను సైతం రోడ్డుకు ఇరువైపులా ఖాళీ ప్రాంతాల్లో పడేస్తున్నా అడిగే నాథుడే ఉండడం లేదు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రోడ్డు నిర్వహణను సక్రమంగా చూడాల్సిన అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తోంది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మల్కాపురం పోలీస్‌స్టేషన్ నుంచి యారాడ మార్గం గుండా వెళ్లాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది.

### నిబంధనలు గాలికి...

పారిశ్రామిక ప్రాంతంలోని రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రోడ్లపై భారీ వాహనాలు ఎక్కడిపడితే అక్కడ నిలుపుతున్నారు. మరి కొన్ని చోట్ల సర్వీసు రోడ్లను అక్రమించి భవన నిర్మాణ సామగ్రి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. భారీ వాహనాలకు ఈ దారుల్లో ప్రవేశం లేకపోయినా నిబంధనలను గాలికొదిలేస్తూ రాకపోకలు సాగిస్తున్నాయి.



రోడ్డు పక్కన గుట్టలుగుట్టలుగా వేసిన భవన నిర్మాణ సామగ్రి

### స్థానిక నేత అండతోనే..

రోడ్డుకు ఇరువైపులా భవన నిర్మాణ సామగ్రి డంపింగ్ చేసి వ్యాపారాలు సాగిస్తున్న వారికి స్థానిక నేత అండగా ఉన్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతా ఆయనే అయి చక్రం తిప్పుతూ వ్యాపారుల నుంచి భారీగా వసూలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడని ప్రచారం సాగుతోంది. అధికారులను సైతం తాను చెప్పినట్లు చేయాల్సిందేనని, లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నట్లు సమాచారం.

### చాలా ఇబ్బందిగా ఉంది



మల్కాపురం నుంచి యారాడ వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా భవన నిర్మాణ సామగ్రి వేయడంతో ప్రయాణించడానికి చాలా ఇబ్బందిగా ఉంది. ఆదివారం అయితే ఇదే మార్గంలో మార్కెట్ కూడా జరుగుతుండడంతో సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది. వాహనాలను మెయిన్‌రోడ్డులో వదిలి కిలోమీటర్లు దూరం నడుచుకుంటూ మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తోంది. వెంటనే రోడ్డుకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాల్లో భవన నిర్మాణ సామగ్రిని తొలగించాలి.

– సూరాడ పెంటారావు, 63వ వార్డు

### వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి



రోడ్డుకు ఇరువైపులా భవన నిర్మాణ సామగ్రి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. రోడ్డుపై సామగ్రి ఉండడంతో రోడ్డు కుదించుకుపోయి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇదే ప్రాంతంలో వీధిదీపాల నిర్వహణ కూడా అంతంత మాత్రంగా ఉంది. అధికారులు స్పందించి రోడ్డుపై సామగ్రి తొలగించడంతో పాటు వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

– దేబార్కి పండు, 40వ వార్డు

## విద్యుత్ లైన్ల నిర్మాణం వేగవంతం చేయాలి

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



కాలనీలో పర్యటిస్తున్న శ్రీధర్, అధికారులు

**విశాఖ విద్య:** జీవీఎంసీ 52వ వార్డు పరిసర ప్రాంతాల్లో చేపట్టనున్న విద్యుత్ లైన్ల నిర్మాణం వేగవంతం చేయాలని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సూచించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్‌తో జరిగిన భేటీలో ప్రస్తావించిన పలు అభివృద్ధి పనులపై సంబంధిత కాంట్రాక్టర్లతో ఆయన మంగళవారం సమీక్షించారు. కాలనీల్లో అధికారులు, సిబ్బందితో కలసి పర్యటించారు. తాసీన్ మసీద్ నుంచి మద్రిపాలెం ఉడా లే అవుట్ వరకు ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలను అండర్ గ్రౌండ్ కేబులింగ్ ద్వారా ఆధునికీకరించే పనులను పర్యవేక్షించారు. అనంతరం వార్డులో పలు విద్యుత్ సంబంధిత సమస్యలను కాంట్రాక్టర్లకు వివరించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో బీహెచ్‌పీవీ గ్రౌండ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు

**అక్కిరెడ్డిపాలెం:** బీహెచ్‌పీవీ గ్రౌండ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా చిన వెంకటరెడ్డి, అధ్యక్షుడిగా ఈడుపుగంటి అనార్ బాబు, ప్రధానకార్యదర్శిగా కొత్తూరు తేజ భాస్కర రావు, కోశాధికారిగా సమ్మి అజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వి.బాబూరావు, కె.రామజోగినాయుడు, సంద్రాన నూకరాజు, గొలగాని రాంబాబు, ముగ్గురు సంయుక్త కార్యదర్శులు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, గౌరవ సలహాదారులుగా పలువురిని ఎన్నుకున్నారు.

## క్లుప్తంగా

### దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

**మల్కాపురం:** జన సంఘ్ వ్యవస్థాపకుడు, లౌకివవాదం అంత్యోదయ మూలకర్త డాక్టర్ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని 59వ వార్డు శాంతిగిరికాలనీలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాలిమేర శ్రీనువాసు పాల్గొని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గురుమూర్తి, లక్కరాజు రామకృష్ణ, సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

### రూ.9వేలు పెన్షన్ అమలు చెయ్యాలి



మాట్లాడుతున్న ఆప్రా కార్యదర్శి ఎస్.కె.హుస్సేన్

**సీతంపేట:** ఆల్‌ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపీఎస్‌ఈనెల 11న ఢిల్లీలో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి మద్దతుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీఆర్‌పీఏ (ఆప్రా) విశాఖ జిల్లా కమిటీ నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆప్రా కార్యదర్శి ఎస్.కె.హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే పెన్షనర్లకు కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలుతో పాటు, పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని డీఏ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దీనబంధు జిల్లా ఉపాధ్యక్షుడు యు.వి.ఎస్.ఎన్.వర్మ, రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకరరావు, సెయిల్ నాయకులు ఎ.నారాయణరావు, ఆర్టీసీ నాయకులు తులసీరామ్, కమిటీ సభ్యులు కె.ఎం.కుమార్ మంగళం, పట్నాయక్, రాము, కె.వెంకట రమణారావు పాల్గొన్నారు.

### ఛాతినొప్పి వస్తే నిర్లక్ష్యం చేయవద్దు

- అత్యవసరమైతే రూ.45వేల ఇంజక్షన్‌తో ప్రాణం నిలబెడతాం
- అగనంపూడి ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెంటెండ్ డాక్టర్ ఉష



స్టెమీ కార్యక్రమంపై రోగులు, వారి బంధువులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఉష, డాక్టర్ ప్రత్యూష

**అగనంపూడి:** ఛాతినొప్పి వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని జీవితాన్ని కాపాడుకోవాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెంటెండ్ డాక్టర్ ఉష, నోడల్ అధికారి డాక్టర్ ప్రత్యూష అన్నారు. స్టెమీ కార్యక్రమంపై ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛాతిలో ఎక్కడైనా నొప్పి అనిపించినా, భుజం లాగడం, దవడ కింద నొప్పిలా రావడం, ఆకస్మికంగా ఒళ్లంతా చెమటలు పట్టడం, ఆయాసం, స్పృహతప్పి పడిపోవడం, గుండెలో దడ పుట్టేలా ఏ లక్షణాలు కనిపించినా గ్యాస్టిక్ నొప్పిగా భావించి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. ఈసీజీతో పాటు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి గుండెనొప్పిగా నిర్ధారణ అయితే గుండెపోటు నుంచి గట్టెక్కించడానికి రూ.45వేల విలువైన ఇంజక్షన్ ఆస్పత్రిలో ఇవ్వడంతో పాటు మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఆస్పత్రికి తరలిస్తామన్నారు. వీటిని సద్వినియోగపర్చుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో డాక్టర్ గోపీకృష్ణ, లలిత, రేష్మా, నర్సింగ్ సూపరింటెంటెండ్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి రవిరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### పాలిటెక్నిక్‌లో నేటి నుంచి ఉచిత శిక్షణ

**మురళీనగర్ :** కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం నుంచి నాలుగు రోజులపాటు ఫార్మాసిస్టులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఫార్మాసిస్టులు తమ నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు భారత ప్రభుత్వ లైఫ్ సైన్సెస్‌లోని నైపుణ్యాభివృద్ధి కౌన్సిల్ ఆధ్వర్యంలో ''ఫార్మకోవిజిలెన్స్ కేస్ ప్రాసెసింగ్'' అనే అంశంపై ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు.

## ఘనంగా పైడిమాంబ అమ్మవారి పరస



పూజలందుకున్న అమ్మవారు



అమ్మవారికి సారె తీసుకొస్తున్న భక్తులు



డిప్యూటీ మేయర్ శ్రీధర్‌కు అమ్మవారి ప్రసాదాన్ని అందజేస్తున్న అర్చకులు

**విశాఖ విద్య :** బుచ్చిరాజపాలెంలోని శ్రీ పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవం మంగళవారం అత్యంత వేడుకగా జరిగింది. ఎన్ఏడీ సెంటర్‌కు ఇరువైపులా ఉన్న పరిసర 16 గ్రామాల ఇలవేల్పుగా పైడిమాంబను కొలుస్తారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పురోహితులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మంగళవారం ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరిగింది. క్యూలైన్లలో భక్తుల కోసం బారికేడ్లను ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారికి పసుపు,కుంకుమ, చీరలు సమర్పించి పూజలు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు దంపతులు, డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు బెహరా భాస్కరరావు, 90వ వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాద్ రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుచ్చిరాజుపాలెం గవరవీధి హర హర గ్రూప్ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం ఘటాల ఊరేగింపు, పులివేషాలు, విచిత్ర వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, ఆలయ అనువంశిక ధర్మకర్త పురెడ్డి ప్రకాశ రెడ్డి, త్రివేణి గ్రామాభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు ఎలమంచిలి చంద్రరావు, మళ్ల చిన్న అప్పారావు, కనక రాజు, దొడ్డి సతీష్, గుళ్లమజ్జి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాలపై పీఆర్‌సీ బృందం సమీక్ష



డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర పీఆర్‌సీ బృంద సభ్యులు

**మహారాణిపేట:** ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పర్యవేక్షణకు ఢిల్లీ నుంచి వచ్చిన పాపులేషన్ రీసెర్చ్ సెంటర్(పీఆర్‌సీ) కేంద్ర బృందం విశాఖ చేరుకుంది. ఈ బృందంలో సభ్యులు డాక్టర్ పాదాలు, రమణ 5 రోజులు పాటు విశాఖలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం రేసవాని పాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, ఆరోగ్య కార్యక్రమాలను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు బృంద సభ్యులకు వివరించారు. మధ్యాహ్నం కంచరపాలెం, దొండపర్తి తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది, కార్యాలయ సిబ్బంది హాజరు పరిశీలించి తగు సూచనలు చేశారు. సమావేశానికి జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు వైభవునికి పంచామృతాభిషేకం



**మురళీనగర్ :** కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా పంచామృతాభిషేకం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఆర్జిత సేవలో పాల్గొనే దాతలు, భక్తులు మంగళధ్వని, వేద మంత్రోచ్చరణ మధ్య ఆలయం చుట్టూ అభిషేక ప్రదక్షిణ చేస్తారు. అనంతరం శ్రీవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేస్తారు. అనంతరం వైభవుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

## గ్రామీణ ప్రజల జీవనం మెరుగుపడాలి



మాట్లాడుతున్న ఆచార్య రాజు

**విశాఖ విద్య :** గ్రామీణ భారతంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు అన్నారు. ఏయూ రాజనీతి – ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రోల్ అండ్ రిలవెన్స్ ఆఫ్ ది పార్లర్ బాడీస్ ఇన్ రూరల్ లోకల్ గవర్నమెంట్' జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాల కల్పన దిశగా కృషి జరగాలని సూచించారు. ఈ ప్రక్రియలో స్థానిక సంస్థలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం, స్వేచ్ఛ అందించాల్సిన అవసరం ఉందన్నారు. పోషక ఆహార లోపం, అనారోగ్యం, మానసిక సమస్యలు వంటివి గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని చెప్పారు. వీటిని పరిష్కరించే దిశగా నిపుణులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సదస్సులో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య పి.ప్రేమానందం తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి.అనిల్ కుమార్, ప్రొఫెసర్ ఎస్సార్ సుభాని, సదస్సు కో డైరెక్టర్ డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ వి.హరీష్, డాక్టర్ షేక్ సులేమాన్, డాక్టర్ కె.దేముడు, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కె.రత్నరాజు, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించొద్దు

**తాటిచెట్లపాలెం :** పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించొద్దని, సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ కోరారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 134వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్‌ను 300 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రైవేటువారికి అప్పగించాలని చూస్తున్నారని, మా పోరాటంతో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నారని తెలిపారు. ప్రైవేటీకరణ నిర్ణయం దారుణమని, వెంటనే ఉపసంహరించుకుని, పోర్టు సొంత నిధులతోనే హాస్పిటల్‌ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, అధ్యక్షుడు జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, మూర్తి, సీహెచ్‌వీఎస్ రెడ్డి, నరసింహ, రాఘవులు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### అటెన్షన్ ప్లీజ్

## సేవా మార్గంలో ఇసుక డంపింగ్



గుల్లలపాలెంకు వెళ్లే మార్గంలో నిర్లక్ష్యంగా డంప్ చేసిన ఇసుక

**మల్కాపురం:** జీవీఎంసీ 58వ వార్డు దుర్గా బార్ పక్క మార్గం నుంచి గుల్లలపాలెంకు వెళ్లే సేవా మార్గంలో ఇసుకను నిర్లక్ష్యంగా డంప్ చేశారు. ఈ కారణంగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రాత్రి సమయంలో విద్యుత్ దీపాల సదుపాయం లేకపోవడంతో మరింత ఇబ్బందికరంగా ఉంది. అధికారులు స్పందించాలి.

– టి.అప్పలరాజు, గుల్లలపాలెం

## మాఘ పౌర్ణమికి గంగవరం ముస్తాబు



మాఘ పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లు

**పెదగంట్యాడ:** మండలంలోని గంగవరం గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామం మొత్తం ముస్తాబైంది. పాత గంగవరంలో వేంచేసియున్న మాధవస్వామి మహాలక్ష్మి తీర్థాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాత్రి గంగవరం గ్రామస్తులు జాగరణ చేశారు. మహాలక్ష్మీ మాధవస్వామి తీర్థాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాగరణ అనంతరం భక్తులంతా బుధవారం వేకువ జామున పాత గంగవరం తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి ఆపై మహాలక్ష్మి మాధవ స్వామిని దర్శించుకోనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

## కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

**డాబాగార్డెన్స్:** నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.